794 టన్నుల యూరియా పంపిణీ

తాడేపల్లిగూడెం:తాడేపల్లిగూడెం రైల్వే రేక్ పాయింట్ ద్వారా 794 టన్నుల యూరియా ప్రయివేటు, కోపరేటివ్ సొసైటీలకు సరఫరా చేసినట్లు జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన తాడేపల్లిగూడెం రైల్వే రేక్ పాయింట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ సార్వాలో 2.09 లక్షల ఎకరాల్లో వరి సాగు, 25,000 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయన్నారు. జిల్లాకు 21,270 టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటివరకూ సుమారు 19,500 టన్నుల యూరియా పంపించినట్లు తెలిపారు. మిగిలిన 1012 టన్నుల యూరియా మార్క్ ఫెడ్‌లో రానున్న రోజులకు అవసరం నిమిత్తం నిల్వ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ప్రయివేటు, సొసైటీలు, మార్క్‌ఫెడ్‌లో 4,800 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ ఆర్.గంగాధర్, మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు, ఎపి మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ గుప్తా పాల్గొన్నారు.

'బెల్టు' జోరు.. 'పర్మిట్ల'తో ఫుల్..!

రెండు జిల్లాల్లో ఏరులై పారుతున్న మద్యం

అన్ని మద్యం దుకాణాల్లో పర్మిట్ రూమ్‌లు అందుబాటులోకి

మరోపక్క బెల్టు షాపులతో వీధివీధికి మద్యం అమ్మకాలు

ఏలూరు, పశ్చిమలో నెలకు రూ.200 కోట్లకుపైగా మద్యం విక్రయాలు

మద్యం పేరుతో సామాన్యులను గుల్ల చేస్తున్న సర్కార్

ప్రభుత్వ తీరుపై తీవ్ర విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మద్యం అమ్మకాల పెంపునకు ప్రభుత్వం అన్ని మార్గాల్లో.. అన్ని విధాలుగా ముందుకు సాగుతోంది. లైసెన్స్ దుకాణాలకు అనుబంధంగా ఇప్పటికే వందల సంఖ్యలో బెల్టు షాపులు కొనసాగుతుండగా, ఇప్పుడు మద్యం దుకాణాలకు పర్మిట్ రూములను మంజూరు చేసి మద్యం అమ్మకాల జోరు విపరీతంగా పెంచుతోంది. మద్యం అమ్మకాలు పెంచుతూ సామాన్యుల ఇల్లు, ఒళ్లను గుల్ల చేస్తున్న పరిస్థితి ఉంది. తాజాగా బార్లకు లైసెన్సులు మంజూరు చేస్తుండటంతో రానున్న రోజుల్లో రెండు జిల్లాల్లోనూ మద్యం ఏరులై పారుతుందనడంలో ఎటువంటి సందేహమూ అక్కర్లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మద్యం షాపులను లాటరీ ప్రక్రియలో కేటాయించింది. ఏలూరు జిల్లాలో 144, పశ్చిమగోదావరిలో 175 మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ నిర్వహించి 2024 అక్టోబర్ 12 నుంచి మద్యం దుకాణాల్లో అమ్మకాలను ప్రారంభించింది. టెండర్ల ద్వారా దుకాణాలు పొందినవారంతా అధికార పార్టీ ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో వాటిని నిర్వహిస్తున్నారంటే ఆశ్చర్యపోక తప్పదు. దీంతో భారీగా మద్యం అమ్మకాలు సాగించేందుకు లైసెన్స్ దుకాణాలకు అనుబంధంగా పెద్దసంఖ్యలో బెల్టు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతి గ్రామంలో ప్రాంతాలవారీగా విభజించి బెల్టు షాపుల కేటాయింపు సైతం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్టుషాపులు కొనసాగిస్తున్నా ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూసిన పాపాన పోవడం లేదు. బెల్టు షాపులకు ప్రతిరోజూ 50 బాటిళ్ల నుంచి వంద బాటిళ్లకుపైగా సరఫరా చేస్తుంటారు. బెల్టు షాపుల్లో ఎంఆర్‌పి కంటే బాటిల్‌కు రూ.20 అంతకు మించి అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారు. బెల్టు షాపులతో మద్యం ఎక్కడపడితే అక్కడే దొరుకుతున్న పరిస్థితి ఉంది. ఇది చాలదన్నట్లు ఇప్పుడు మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లకు ప్రభుత్వం అనుమతిచ్చింది.

పర్మిట్ రూములతో మరింతగా మద్యం అమ్మకాలు

గతంలో లైసెన్స్ బార్లలో మాత్రమే సిట్టింగ్ విధానం ఉండేది. మద్యం దుకాణాల్లో మద్యం విక్రయాలు మాత్రమే సాగేవి. కూటమి ప్రభుత్వం మాత్రం లాటరీ ద్వారా పొందిన అన్ని మద్యం దుకాణాల్లోనూ పర్మిట్ రూములకు అనుమతిచ్చింది. దీంతో ప్రతి మద్యం దుకాణం వద్దా పర్మిట్ రూములు వచ్చాయి. దీంతో గతంలో క్వార్టర్ తాగే మందుబాబులు అక్కడే కూర్చొని అదనంగా మద్యం తాగే పరిస్థితి ఏర్పడింది. ఈ విధంగా ప్రభుత్వం మద్యం అమ్మకాలను మరింత పెంచుతోంది. ఇప్పుడు బార్లకు లైసెన్స్‌ల మంజూరు ప్రక్రియ చేపట్టింది. ఏలూరు జిల్లాలో 20 బార్లు ఉండగా ఇప్పటి వరకూ పది బార్లకు లైసెన్స్‌లు మంజూరు చేసింది. మిగిలిన వాటికి త్వరలో లైసెన్స్‌లు ఇవ్వనుంది. మద్యం అమ్మకాల పెంపునకు ప్రభుత్వం అన్ని ప్రయత్నాలూ చేస్తోంది. సామాన్య ప్రజానీకం కష్టపడిన సంపాదనంతా మద్యం రూపంలో ప్రభుత్వం గుంజుకుంటున్న పరిస్థితి ఉంది. అదే క్రమంలో మద్యం తాగి అంతా ఒల్లు గుల్ల చేసుకుని అనారోగ్యం పాలవుతున్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఇస్తున్న సొమ్మును మద్యం రూపంలో ప్రభుత్వం లాగేస్తున్న పరిస్థితి ఉంది.

రెండు జిల్లాల్లో ప్రతినెలా రూ. 200 కోట్లకుపైగా మద్యం అమ్మకాలు

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రతినెలా రూ.200 కోట్లకుపైగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయంటే ఆశ్చర్యపోక తప్పదు. పర్మిట్ రూములతో అమ్మకాలు మరింత పెరుగుతున్నట్లు తెలుస్తోంది. ఏలూరు జిల్లాలో నెలకు రూ.లక్ష నుంచి రూ.లక్షా 30 వేల వరకూ మద్యం కేసుల విక్రయాలు సాగుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఒక్కో కేసులో 48 క్వార్టర్ బాటిళ్లు ఉంటాయి. 70 వేల వరకూ బీర్ కేసులు అమ్మకాలు సాగుతున్నాయి. పశ్చిమలో దుకాణాలు ఎక్కువగా ఉండటంతో అమ్మకాల జోరు సైతం అదేవిధంగా ఉంది. రాత్రి పది గంటలకు మద్యం దుకాణాలు మూసివేయాలనే నిబంధన ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదు. షట్టర్ మూసి వెనుకనుంచి రాత్రంతా అమ్మకాలు సాగిస్తున్న పరిస్థితి ఉంది. మద్యం ద్వారా ఆదాయం పెంచుకునేందుకు ప్రభుత్వం అత్యంత దారుణంగా వ్యవహరిస్తోంది.

వరద గోదావరి తగ్గుముఖం

ఊపిరి పీల్చుకున్న లంక గ్రామాల ప్రజలు

ప్రజాశక్తి - ఆచంట

వశిష్ట గోదావరి శాంతించింది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. కోడేరులో పుష్కర ఘాట్లో దాదాపు మూడు అడుగుల మేర వరద తగ్గింది. వరద తగ్గుముఖం పట్టడంతో మండలంలోని లంక గ్రామాల ప్రజలతోపాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. తహశీల్దార్ జి.కనకరాజు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు వరద సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. అయితే గోదావరిలో వరద ప్రవాహ ఉధృతి ఎక్కువగానే ఉండటంతో లంక గ్రామాల మధ్య పడవ రాకపోకలకు అధికారులు అనుమతులు ఇవ్వలేదు. లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో కూరగాయలు పండించిన రైతులు వరదలతో తీవ్రంగా నష్టపోయిన పరిస్థితి ఉంది. గోదావరి వరద తగ్గుముఖం పట్టినా లంక గ్రామాలు మాత్రం ఇంకా జల దిగ్బంధంలోనే కొనసాగుతున్నాయి. ధవళేశ్వరం నుంచి సుమారు పది లక్షల క్యూసెక్కులకుపైగా వరద నీరు దిగువకు రావడంతో లంక భూముల్లో వరద నీరు పూర్తిగా తొలగలేదు. భీమలాపురం, కరుగోరుమిల్లి మధ్యలో లంక భూములు ముంపులోనే ఉన్నాయి. పెదమల్లం కరుగోరుమిల్లి, కోడేరు, భీమలాపురం పుష్కర ఘాట్లు ముంపులోనే ఉన్నాయి.

కోడేరు వద్ద తగ్గు ముఖం పట్టిన వశిష్ట గోదావరి

యలమంచిలి: గోదావరి వరద మంగళవారం నిలకడగా ఉంది కనకాయలంక గ్రామంలో స్థానిక ప్రజలు ఇంకా పడవలోనే తమ ప్రయాణాలను సాగిస్తున్నారు. కనకాయలంకతోపాటు పెదలంక, బాడవ, యలమంచిలి లంక, లక్ష్మీపాలెం, వడ్డిలంక, గంగడపాలెం, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, కంచుస్తంభంపాలెం తదితర గ్రామాల్లో కొబ్బరి, అరటి, తమలపాకు తోటల్లోకి ప్రవేశించిన వరద నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కర్నూలు ఉల్లి వినియోగించి రైతులను ఆదుకోవాలి

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని వివిధ విద్యాసంస్థలు, వసతి గృహాల వంటకాల్లో కర్నూలు ఉల్లి వినియోగించి కష్టకాలంలో ఉన్న ఉల్లి రైతులను ఆదుకోవాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి కోరారు. స్థానిక కలెక్టరేట్లో ఆయన కర్నూలు ఉల్లి వినియోగంపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. కర్నూలు, నంద్యాల ఉల్లిపాయలు అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రయివేటు కళాశాలలు, పాఠశాలల హాస్టళ్ల వంటకాల్లో కర్నూలు ఉల్లిని వినియోగించేలా చూడాలన్నారు. ఆర్‌డిఒలు కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దాసి రాజు, ఖతీబ్ కౌసర్ భానో, మార్కెటింగ్ ఎడి ఎం.సునీల్‌కుమార్, తహశీల్దార్లు, నిట్, ఎస్‌ఆర్‌కెఆర్, విష్ణు, శశి, తిరుమల, స్వర్ణాంధ్ర విద్యాసంస్థల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

సమ్మె ఒప్పందాలు అమలు చేయకపోవడం సిగ్గుచేటు

18న రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాల్టీల వద్ద నిరసన ప్రదర్శన

20వ తేదీ నుంచి మూడు రోజులపాటు దీక్షలు

23న విజయవాడలో వేలాది మంది కార్మికులతో ధర్నా

మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

మున్సిపాల్టీల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ కె.నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్యఅతిథి ఉమామహేశ్వరరావు మాట్లాడారు. మున్సిపల్ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వంలో పోరాడి సాధించుకున్న సమ్మె ఒప్పందాలు నేటికీ అమలు చేయలేదన్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవుల డబ్బులు విడుదల చేయలేదని విమర్శించారు. కూటమి అధికారంలోకొచ్చి 14 నెలలు దాటినా పిఆర్‌సి ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. వేతనాల పెంపు, సమ్మె ఒప్పందాల అమలు, పిఆర్‌సి కోసం ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీల వద్ద నిరసన ప్రదర్శనలు చేస్తున్నట్లు తెలిపారు. 20, 21, 22 తేదీల్లో దీక్షలు చేపడతామన్నారు. 23న విజయవాడ ప్రకాష్ సౌత్ సెంటర్లో వేలాది మందితో ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే పారిశుధ్య పనుల ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. దశలవారీ పోరాటాల్లో మున్సిపల్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యూనియన్ జిల్లా కార్యదర్శి ధనాల వెంకట్రావు మూడేళ్ల కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టగా మహాసభ ఆమోదించింది. యూనియన్ నాయకులు కర్రి నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, వి.గోపాలకృష్ణ, బి.రమేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కార్మికుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం

రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు

ప్రజాశక్తి - పాలకొల్లు

కార్మికవర్గ ఐక్యతతోనే సమస్యలు పరిష్కరించాలని రైస్‌మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు అన్నారు. మంగళవారం స్థానిక మహిళా భవనంలో జరిగిన రైస్‌మిల్లు కార్మికుల జనరల్‌బాడీలో ఆయన పాల్గొన్నారు. గుబ్బల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత కార్మికోద్యమ నేత రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్‌ఎస్) చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ పాలకొల్లులో కార్మికుల మధ్య ఐక్యత లేకపోవడం వల్ల సరైన వేతనం పొందలేకపోతున్నారన్నారు. పాలకొల్లులో ఇఎస్‌ఐ డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. డిస్పెన్సరీ లేకపోవడంతో కార్మికులు అన్నివిధాలా నష్టపోతున్నారన్నారు. యాజమాన్యం ప్రతి కార్మికుడికీ సక్రమంగా పిఎఫ్, ఇఎస్‌ఐ చెల్లించాలని కోరారు. రానున్న కాలంలో సంఘాలతో సంబంధం లేకుండా ఉమ్మడి నోటీసులతో మంచి అగ్రిమెంట్లు సాధించుకుందామని పిలుపునిచ్చారు. ఇతర ప్రాంతాల్లో కార్మికులు ఇక్కడ వారికన్నా మంచి బోనస్, గ్రాట్యుటీ, సెలవు వేతనాలు పొందుతున్నారన్నారు. మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ మాట్లాడుతూ మిల్లుల యాంత్రీకరణతో పని దినాలు తగ్గాయన్నారు. కలిసి అగ్రిమెంట్లకు వెళితే కార్మికులు మంచి ఫలితం పొందుతారని అన్నారు. సంఘ కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్ కార్యక్రమాలు వివరించారు. సమావేశంలో వేగి రత్తయ్య, తాడి వెంకటేష్, ఆకుల ప్రసాద్, వీరవల్లి సత్యనారాయణ, మల్లుల లక్ష్మినారాయణ, తమ్మా సూర్యారావు పాల్గొన్నారు. ఇఎస్‌ఐ డిస్పెన్సరీ ఏర్పాటు కోసం సంతకాలు సేకరించాలని సమావేశం నిర్ణయించింది.

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వాసుదేవరావు

నరసాపురాన్ని జిల్లా కేంద్రం చేయాలని వినతులు

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

నరసాపురాన్ని జిల్లా కేంద్రంగా చేయాలంటూ జెఎసి ఆధ్వర్యాన మంగళవారం పట్టణంలో కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత జెఎసి నాయకులు పట్టణంలోని జనసేన కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభించారు. అక్కడ నుంచి వీరంతా భీమవరం బయలుదేరారు. ర్యాలీకి ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు, కన్వీనర్ నెక్కంటి సుబ్బారావు జెండా ఊపారు.

భీమవరం టౌన్: జిల్లా కేంద్రం నరసాపురంలో ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం నరసాపురం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు అఖిలపక్ష నాయకులతో కలిసొచ్చి కలెక్టర్ నాగరాణికి, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మకు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా విప్ నాయకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజనను అడ్డగోలుగా సాగించిందని విమర్శించారు. ప్రతి పార్లమెంటు కేంద్రాన్ని జిల్లా కేంద్రం చేశారని, పశ్చిమగోదావరికి మాత్రం భీమవరం జిల్లా కేంద్రం చేసి నరసాపురం ప్రజలకు అన్యాయం చేశారన్నారు. మాజీ ఎంఎల్‌ఎ మాధవనాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిదిద్దుకోవడానికి కూటమి ప్రభుత్వం సబ్ కమిటీని నియమించిందని, ఈ కమిటీకి నరసాపురం జిల్లా కేంద్రం విషయాన్ని తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, డిసిఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ, అఖిలపక్ష నాయకులు, నియోజకవర్గ ప్రజలు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మకు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎల్‌ఎ, నేతలు

ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర కౌన్సిలర్‌గా శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం

ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్‌గా వేండ్ర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న జివివి.శ్రీనివాస్ ఎన్నికయ్యారు. భీమవరం పిఎస్‌ఎం బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా శాఖ ఎన్నిక మంగళవారం నిర్వహించారు. జిల్లా శాఖ నుంచి రాష్ట్ర కౌన్సిలర్‌గా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎన్నికైన శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి, ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. ఎం.వెంకటరమణ, జె.శ్రీనివాసు, జె.ఏసుబాబు, ఎం.నాగబాబు, పంపన సాయిబాబు, వి.పార్వతి, సిహెచ్.రాధ, వరలక్ష్మి, విశ్వనాథరాజు, సునీల్, ఎంఎస్.శ్రీనివాస్, వివి.శ్రీధర్, ఎం.నాగబాబు శుభాకాంక్షలు అభినందించారు.

శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆలమూరు పిహెచ్‌సిలో డిఎంహెచ్‌ఒ తనిఖీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని ఆలమూరు పిహెచ్‌సిని డిఎంహెచ్‌ఒ డాక్టర్ గీతాబాయి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో రోగులకు అందుతున్న వైద్యసేవలు, ఒపి, ఇహెచ్‌ఆర్ సేవలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వైరల్ జ్వరాలు ప్రబలకుండా వైద్య సేవలందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ వి.అనిల్‌కుమార్, ఎంపిహెచ్‌ఒ శివ ప్రసాద్, డిప్యూటీ హెచ్‌ఇఒ పిబి.రామారావు, విజయ్ కుమార్, రాజు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎరువుల దుకాణాల వ్యాపారులు, డీలర్లు కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి, రైతులను మోసగించాలని చూస్తే చట్టప్రకారం తీవ్రమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో వ్యవసాయ పనులు ఊపందుకున్న నేపథ్యంలో కొంతమంది వ్యాపారులు ఎరువుల కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. రైతులను బ్లాక్ మార్కెట్ నుండి రక్షించడానికి, ఎరువుల సరఫరాలో పారదర్శకతను పెంచడానికి జిల్లా పోలీసులు, వ్యవసాయ, ఇతర అనుబంధ శాఖల సమన్వయంతో పని చేసి ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిర్ణీత ధరలకు మించి అధిక ధరలకు విక్రయించినా ఆ దుకాణాలను తక్షణమే సీజ్ చేయడంతోపాటు డీలర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

గత ప్రభుత్వ తీరుతో కుంటుపడిన అభివృద్ధి

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి - ఉండి

నిధులను పక్కదారి పట్టించి అభివృద్ధి కుంటుపడేలా చేసిన ఘనత గత ప్రభుత్వానిదని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. ఉండి మార్కెట్ యార్డులో మంగళవారం నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ వేగేశ్న సూర్యనారాయణరాజు, రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు పాల్గొన్నారు. నూతన ఛైర్మన్, వైస్ ఛైర్మన్, సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ పుంత రోడ్లు అభివృద్ధి లేక అధ్వానంగా తయారయ్యాయన్నారు. డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ స్వాహా చేసే ప్రభుత్వానికి ప్రజలు స్వస్తి పలికారని, ఆహా అనిపించేలా పని చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలుకుతున్నారన్నారు. త్వరలోనే పుంత రోడ్లు పునర్నిర్మించి వారి ఉన్నతికి కృషి చేయాలని ఎఎంసి పాలకవర్గానికి సూచించారు. ఎఎంసిలోనే అగ్రికల్చర్ ల్యాబ్ ఉందని, దానిని పూర్తిస్థాయిలో పునరుద్ధరించి అక్టోబర్ రెండో తేదీకి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కెవికెలోని మత్స్య పరిశోధనా స్థానం ప్రయోగశాలకు రూ.ఐదు కోట్లు విలువైన పరికరాలు వచ్చాయని, వాటినీ అక్టోబర్ రెండో తేదీకి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. జనసేన నేత నాగరాజుకు సముచిత స్థానం కల్పించేలా జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పదవి ఇవ్వాల్సిందిగా ఇప్పటికే తాము రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపించానని తెలిపారు. అనంతరం నూతన కమిటీ ఛైర్మన్ కలిదిండి రామకష్ణంరాజు, వైస్ ఛైర్మన్ యడవిల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమకు పదవులు కట్టబెట్టిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా రైతులకు అందుబాటులో ఉంటూ ఎఎంసిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ఉండవల్లి శ్రీదేవి, డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ కునాధరాజు మురళీకృష్ణంరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ ముత్యాల రత్నం, డిసి ఛైర్మన్ తోట ఫణిబాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.



నూతన కమిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను అభినందిస్తున్న కనుమూరి రఘురామ కృష్ణంరాజు

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

6న ఎస్‌ఎఫ్‌ఐ చలో విజయవాడ

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఈ నెల ఆరో తేదీన చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బి.గణేష్ తెలిపారు. స్థానిక సిఎస్‌ఎన్ కాలేజీలో దీనికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లించాలని, జిఒ నెం.77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వసతిగృహాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. హాస్టల్ విద్యార్థుల మెస్ ఛార్జీలు రూ.మూడు వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లోకి విద్యార్థి సంఘాలను రానీయకుండా ఇచ్చిన జిఒ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షులు సాయికృష్ణ, పట్టణ ఉపాధ్యక్షులు సాయితేజ పాల్గొన్నారు.

నైపుణ్యం కలిగిన వృత్తి టైలరింగ్

ప్రజాశక్తి - తణుకు

సమాజంలో మానవునికి నాగరికత నేర్పిన, ఎంతో నైపుణ్యం కలిగిన వృత్తి టైలరింగ్ మాత్రమేనని వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు కొనియాడారు. వేల్పూరు టైలర్స్ వర్కర్స్ సంఘం సమావేశం అధ్యక్షులు మల్లేశ్వరపు నాగరాజు అధ్యక్షతన స్థానిక పార్వతీదేవి ఆలయ ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో యువతపై రెడీమేడ్ దుస్తులు ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. దీంతో ఏళ్ల తరబడి టైలరింగ్‌ను నమ్ముకుని జీవిస్తున్న అనేక కుటుంబాలు ఉపాధి కోల్పోయి ఆర్థిక సమస్యలతో అనేక కష్టాలు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఆదరణ - 3 పథకం ద్వారా టైలర్లకు అవసరమైన అధునాతన (జుక్కి) కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, తాడిశెట్టి కోటి వెంకటేశ్వరరావు, ఆనందం గణేష్, రుద్రాక్షల శ్రీనివాసు, కరేళ్ల రాంబాబు, పోలవరపు సూరిబాబు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్య భద్రత

ప్రజాశక్తి - భీమవరం టౌన్

విద్యార్థులకు స్నానం చేయిస్తున్న దృశ్యం

వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్య భద్రత నినాదంతో స్వచ్ఛతా హి సేవా-25 లో భాగంగా శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో తలంటు, క్షవరాలు కార్యక్రమాన్ని మంగళవారం భీమవరం వెనుకబడిన తరగతుల బాలుర వసతి గృహంలో నిర్వహించారు. హాస్టల్ వార్డెన్ చిటికెల మోహన్‌రావు మాట్లాడుతూ మన పరిసరాల శుభ్రత తోపాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాగరాణి పిలుపుమేరకు విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామన్నారు.

రోగులకు పండ్లు, గుడ్లు పంపిణీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రముఖ న్యాయవాది బి.దామోదర్‌రావు మనవరాలు సహస్ర మొదటి పుట్టినరోజు సందర్భంగా వారి కుటుంబ సభ్యులు సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని న్యాయవాది ఉండపల్లి రమేష్ నాయుడు, ప్రముఖ వైద్యులు ఎం.గోవిందబాబు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి అన్నారు. మంగళవారం భీమవరం ప్రభుత్వాసుపత్రి, ఏఆర్‌టి సెంటర్‌లోని 86 మందికి పండ్లు, గుడ్లు, రొట్టెలను పంపిణీ చేశారు.

ఉచిత షుగర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మధుమేహం నివారణకు ఆహారపు అలవాట్లు మార్చుకోవాలని ఫాస్ట్ జోనల్ ఛైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్అండ్‌బి గ్రౌండ్స్‌లో పేరిచర్ల మురళీ కృష్ణంరాజు ఆధ్వర్యంలో డైమండ్స్, లయన్స్ సర్వీస్ ఛైర్ పర్సన్ లయన్ కోనా హనుమాన్ సౌజన్యంతో ఉచిత షుగర్ పరీక్షల శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ అన్ని వయసుల వారిని పట్టి పీడిస్తున్న మహమ్మారి మధుమేహం అన్నారు. మన ఆరోగ్యం కోసం ఆహారపు అలవాట్లు మార్చుకోవాలన్నారు. జోన్ ఛైర్‌పర్సన్ షేక్ బాజీ మాట్లాడుతూ షుగర్ వ్యాధి నియంత్రణ లయన్స్ బాధ్యతగా చేపట్టాలన్నారు. ఆర్ అండ్ బి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ నడక వల్ల వచ్చే ఉపయోగాలు వివరించారు. ఈ కార్యక్రమంలో డైమండ్స్, లయన్స్ క్లబ్ సభ్యులు, న్యాయశాఖ విశ్రాంత అధికారి గుప్తా పాల్గొన్నారు.

వాలంటీర్లకు శిక్షణ

ప్రజాశక్తి - ఉండి

వయోజనులకు 100 రోజుల శిక్షణ ఇచ్చి వారిని అక్షరాస్యులుగా మార్చడమే అక్షరాంధ్ర అక్షరాస్యత కార్యక్రమం ఉద్దేశమని జిల్లా నోడల్ అధికారి కెవివి.సత్యనారాయణ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ సమావేశం హాల్లో డ్వామా ఇన్‌ఛార్జి ఎపిఓ ఒమేగా రాజు ఆధ్వర్యంలో ఉల్లాస్ 'అక్షరాంధ్ర- అక్షరాస్యత' కార్యక్రమంపై వాలంటీర్లకు మండల స్థాయి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా నోడల్ అధికారి కెవివి.సత్యనారాయణ పాల్గొని వాలంటీర్లకు అవగాహన కల్పించారు. మండలంలో డ్వామా గ్రూపుల్లో ఉన్న వెయ్యి మంది నిరక్షరాశ్యులను గుర్తించి, వారిలో ప్రతి పది మంది లెర్నర్‌లకు ఒక్కో మేట్‌ను వాలంటీర్‌గా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శిక్షణలో లెర్నర్స్‌కు డిజిటల్ లిటరసీ ఫైనాన్షియల్ లిటరసీ, మరియు ఫంక్షనల్ లిటరసీ అంశాలపై తర్ఫీదు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ఎంపిడిఒ మాట్లాడారు. ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, వాలంటీర్లు పాల్గొన్నారు.

మండల విద్యాశాఖాధికారులకు సత్కారం

ప్రజాశక్తి - కాళ్ల

మండల అధికారులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన వారి సేవలు గుర్తించి వారిని సత్కరించడం అభినందనీయమని ఎంఇఒ అధికారి-1 డి.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం కోపల్లె ఉన్నత పాఠశాలలో కాళ్ల మండలంలో నాలుగేళ్ల ఎంఇఒగా పనిచేసిన ఎ.రవీంద్ర, తక్కువ కాలం ఎంఇఒ-2గా పని చేసిన వి.సీతారామయ్యను ఘనంగా సత్కరించారు. పలువురు వక్తలు మాట్లాడారు. రవీంద్ర కాళ్ల మండలంలో ఉపాధ్యాయుల సంక్షేమానికి, పాఠశాల ప్రగతికి, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలకు చక్కని ప్రణాళికతో నడిపించిన తీరును ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఇఒ-2 జి.కనకరాజు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు నిర్మలాదేవి, మోహనరావు, గౌరీ శంకర్, మోజస్ యూనియన్ నాయకులు సాయివర్మ, కుమార్ బాబ్జి, కృష్ణమూర్తి, మురళి, జనార్దన్ స్వామి పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక నిల్వపై రాఘవులుకు వినతి

ప్రజాశక్తి - ఆచంట

రాఘవులుకు వినతి అందజేస్తున్న వైసిపి నేతలు

పేదలకు ఉచితంగా అందించాల్సిన ఇసుకను ఆచంటలో టిడిపి నాయకుడు గణపతినీడి రాంబాబు అక్రమంగా ర్యాంపుల ద్వారా తరలించి, గ్రామాల్లో గుట్టలుగా నిల్వ చేసి తరలిస్తున్నారని, అధికారులకు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని సిపిఎం కేంద్ర పొలిట్ బ్యూరో సభ్యులు బివి.రాఘవులుకు భీమవరంలో జరిగిన సెమినార్‌లో వైసిపి నాయకులు సుంకర సీతారామ్, కోట వెంకటేశ్వరరావు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టిడిపి నాయకుడు రాంబాబు నియోజకవర్గంలోని ఇసుక ర్యాంపుల ద్వారా అక్రమంగా ఇసుక తరలించి, నిల్వ చేసి అధిక రేటుకు అమ్ముతున్నారని తెలిపారు. పేదలకు ఉచితంగా అందజేయాల్సిన ఇసుకను అక్రమ మార్గంలో తరలించి, ఇసుక మాఫియా డాన్‌గా రాంబాబు అవతరించాడని విమర్శించారు. దీనిపై పైఅధికారులు స్పందించాలని కోరారు.

మహిళ మెడలో సూత్రాల తాడు చోరీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

నత్తారామేశ్వరంలో మహిళ మెడలోని సూత్రాల తాడుని దొంగలు లాక్కుని పారిపోయిన ఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. నత్తా రామేశ్వరానికి చెందిన కడలి లక్ష్మీ ఉదయం సమయంలో కిరాణా షాపు ముందు తుడుస్తుండగా ఇద్దరు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని తాడు తెంపేసి తీసుకెళ్లిపోయారు. ఆమె కేకలు వేయడంతో పారిపోయారు. బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అంబేద్కర్ గురుకుల హాస్టల్‌కు ఫ్యాన్లు, లైట్లు అందజేత

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలకు మానవత, లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన మంగళవారం 6 ఫ్యాన్లు, 20 ట్యూబ్ లైట్లు అందజేశారు. హాస్టల్ రూముల్లో ఫ్యాన్లు, లైట్లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పాఠశాల ప్రిన్సిపల్ సుభాషిణి వారిని కోరారు. ఈ నేపథ్యంలో మంగళవారం మానవత, లయన్స్ క్లబ్ ఆర్థిక సహాయంతో ఫ్యాన్లు, ట్యూబ్ లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత ప్రెసిడెంట్ కొమ్ముల రామకృష్ణ, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ గాజుల బుల్లి పుల్లారావు, కర్రి నరేంద్ర రెడ్డి, బచ్చు నరసింహమూర్తి, వేండ్ర రామ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

వైఎస్ఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట: మాట్లాడుతున్న చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పేదలలకు ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్ ప్రధాత వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర పిఎసి మెంబర్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఆచంటలో వైఎస్ఆర్ వర్థంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వర అధ్యక్షత వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పేదల పాలిట పెన్నిధి వైఎస్ఆర్ అని తెలిపారు. నియోజకవర్గంలోని జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

గణపవరం : వైఎస్ఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలని వైసిపి మండల అధ్యక్షులు దండు రాము అన్నారు. ఇందిరమ్మ కాలనీ కుమారి థియేటర్ వద్ద రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాళ్ల: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందించిన ఏకైక మహానేత వైఎస్ఆర్ ఒక్కరేనని పలువురు వక్తలు కొనియాడారు. వైఎస్ఆర్ వర్థంతి సందర్భంగా పెదఅమిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహారాజు పాల్గొని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామ అధ్యక్షులు వేగేశ్న జయరామ కృష్ణంరాజు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షులు గణేశ్న రాంబాబు, వీరమల్లు బోసు, బిరుదు గడ్డ గంగాధర్, పి.రంగరాజు, కొలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు : మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయ సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ పూలమాలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో వైసిపి మండల అధ్యక్షులు రేవు నారాయణమూర్తి, పట్టణ అధ్యక్షులు కుక్కల కృష్ణమోహన్, కె.ముక్తేశ్వరరావు, బొక్క నాగరాజు, పాల రాంబాబు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : పేదల ఆరోగ్యానికి రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా భరోసా కల్పించిన మహనీయుడు వైఎస్ఆర్ అని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. పట్టణంలోని పోలీస్ ఐలాండ్, ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్లలో రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పట్టణంలో వైసిపి శ్రేణులు ర్యాలీ నిర్వహించారు. వైసిపి పట్టణ అధ్యక్షులు కాళ్లకూరి ధర్మరాజు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ కర్రి భాస్కరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి బొద్దాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెనుమంట్ర: వైఎస్ఆర్ వర్థంతి సందర్భంగా పెనుమంట్రలో వైసిపి నేతలు, కార్యకర్తలు ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, పేదలకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, వైసిపి గ్రామ అధ్యక్షులు తేతలి సుధీర్ రెడ్డి, ఎంపిటిసి జి.రాము పాల్గొన్నారు.

జనం హృదయాల్లో నిలిచిన నేత వైఎస్ఆర్ అని వైసిపి సీనియర్ నాయకులు అల్లం బుల్లి రెడ్డి అన్నారు. వైసిపి మార్టేరు గ్రామ అధ్యక్షులు కొవ్వూరి బ్రహ్మేశ్వర్‌రెడ్డి ఆధర్యంలో సెంటర్లోని ఆయన విగ్రహం వద్ద పంచ గ్రామ వైసిపి నాయకులు,కార్యకర్తలు నివాళులర్పించారు.

ఉండి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పలువురు వైసిపి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు బాలాజీ, రాయి సతీష్ మాట్లాడారు. గ్రామ అధ్యక్షులు కరిమెరక మల్లికార్జున, ఉప్పులూరు ఎంపిటిసి నిమ్మల కేశవ్‌కుమార్, వి.ముసలయ్య పాల్గొన్నారు.

భీమవరం టౌన్ : పేదల పెన్నిధి వైఎస్ఆర్ అని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. స్థానిక శ్రీనివాస్ సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు కోడె విజయలక్ష్మి, సీనియర్ నాయకులు యుగంధర్, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చినిమిల్లి వెంకట్రాయుడు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : యాళ్లవానిగరువులోని వైసిపి కార్యాలయంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేదలకు రగ్గులు, చీరలు పంపిణీ చేశారు. న్యాయవాది, వైసిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాకినాడ జిల్లా మహిళా విభాగం ఇన్‌ఛార్జి కర్రా జయ సరిత, గూడూరి ఉమాబాల పాల్గొన్నారు.

పాలకొల్లు : వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ ఆధ్వర్యంలో వర్థంతిని నిర్వహించారు. ఆయన నివాళులర్పించి పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. న్యాయవాది, వైసిపి మహిళా విభాగం స్టేట్ ప్రధాన కార్యదర్శి, కర్రా జయ సరిత, నేతలు యడ్ల తాతాజీ, జోగాడ ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకివీడు : ప్రస్తుత సమయంలో రాష్ట్రంలో వైసిపి అవసరం ఎంతైనా ఉందని, వైఎస్ఆర్ వర్థంతి కార్యక్రమాలు రాష్ట్రమంతా జరుగుతున్నాయని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహరాజు తెలిపారు. మెయిన్ సెంటర్లో వైఎస్ఆర్ కాంస్య విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. అనంతరం పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు స్వీట్లు పంపిణీ చేశారు. జెడ్‌పిటిసి సభ్యులు పెనుమత్స వెంకట్రాజు (యండగండి శీను), వైసిపి మండల అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య, మాజీ అధ్యక్షులు గుండా చిన్ని, అంబటి రమేష్, మొర జ్యోతి పాల్గొన్నారు.

నరసాపురం రూరల్ : వైఎస్ రాజశేఖరరెడ్డి వర్థంతి సందర్భంగా వైసిపి కార్యాలయంలోని వైఎస్ఆర్ చిత్రపటానికి పిడి రాజు, ఎంపిపి సోని, కామన బుజ్జి, కెనడీ, కాకిలేటి మధు, బొక్కా రాధకృష్ణ పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రదర్శనగా వచ్చి స్టీమర్ రోడ్డులో వైఎస్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పవన్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి

పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కాళ్లలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న నేతలు, అభిమానులు

ప్రజల కోసం ఏదైనా చేయాలనే తపన.. పేదవాడి బతుకు బాగుండాలనే ఆలోచన ఒక్కటే పవన్ కళ్యాణ్ మదిలో మెదులుతూ ఉంటుందని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. మంగళవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా అంజిబాబు కేక్ కట్ చేసి మాట్లాడారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ పులపర్తి ప్రశాంత్ మాట్లాడారు. జనసేన పట్టణ, మండల నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు పాల్గొన్నారు.

ఆచంట : పవన్ కళ్యాణ్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు పిలుపునిచ్చారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన నాయకులు, పవన్ కళ్యాణ్ అభిమానుల ఆధ్వర్యంలో కచేరీ సెంటర్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సుబ్బారాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. కొత్తపల్లి మాట్లాడారు. ముందుగా ఆచంట రామేశ్వరస్వామి సత్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం స్వీట్లు, బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. జనసేన నాయకులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్, నంబూరు విజయ్, ఎ.నాగరాజు, చిట్టూరి శ్రీనివాస్, డి.పుణ్యావతి పాల్గొన్నారు.

కాళ్ల : పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు కాళ్లలో ఘనంగా నిర్వహించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో సుమారు 100 మంది యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. కాళ్ల సొసైటీ అధ్యక్షుడు, జనసేన మండలాధ్యక్షుడు ఎరుబండి రామాంజనేయులు, ఆరేటి దిలీప్, నిమ్మకాయల సాయికుమార్, గడి రాము, ఓగిరాల రాజేష్, ఇర్రింకి జగన్, గనిశెట్టి సత్యనారాయణ, బి.సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఉండి:జనసేన అధినేత పవన్ కళ్యాణ్ 54వ పుట్టినరోజు వేడుకలను ఉండి మెయిన్ సెంటర్లో ఘనంగా నిర్వహించారు. కలిదిండి రామచంద్ర రాజు జన్మభూమి పార్క్ వద్ద నుంచి ఎఎంసి ప్రమాణస్వీకారం కార్యక్రమానికి ర్యాలీగా వెళ్లిన కూటమి నాయకులు మెయిన్ సెంటర్లో కేక్ కట్ చేసి పవన్‌కళ్యాణ్ అభిమానులకు తినిపించి వేడుకలు నిర్వహించారు. టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, జనసేన గ్రామ అధ్యక్షులు ఆరేపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : పెదమామిడిపల్లి కాలనీలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఓ మహిళకు పాతిక కేజీల బియ్యం, వెయ్యి రూపాయలు, దుస్తులు మెగా పవర్ ఫ్యాన్స్, జనసైనికుల ఆధ్వర్యంలో అందజేశారు. చేబ్రోలు కృష్ణమోహన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవ అధ్యక్షులు తులా రామలింగేశ్వరరావు, దుర్గబాబు, నవీన్ పాల్గొన్నారు.

పాలకొల్లు : పవన్‌కళ్యాణ్ జన్మ దినోత్సవం సందర్భంగా లయన్స్ కమ్యూనిటీ హాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆర్.కృష్ణయ్య జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవానీయాదవ్ 64వ సారి రక్త దానం చేశారు. ఎంతో మంది యువతకు ఆదర్శంగా నిలిచారు. గణేష్ భవానీయాదవ్‌ను పలువురు అభినందించారు.

పెనుమంట్ర : మార్టేరు సెంటర్లో జనసేన ఆధ్వర్యంలో కేకు కట్ చేసి, పేదలకు దుస్తులు అందజేశారు. జనసేన మండల అధ్యక్షులు కోయ వెంకట్ కార్తీక్, నాయకులు బయ్యే బాలాజీ, తోరం వెంకన్నబాబు, షేక్ అలీ, కూటమి నేతలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సిఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. జువ్వలపాలెంలో శ్రీదేవి పుంతలో కామిరెడ్డి వీరేంద్ర ఆధ్వర్యంలో వెయ్యి మందికి అన్నదానం చేశారు. మొక్కలు, జనసేన టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ శ్రీనివాస్, బిజెపి తాడేపల్లిగూడెం కన్వీనర్ ఈతకోట తాతాజీ మాట్లాడారు. అనంతరం ఎంఎల్ఎ ఏరియా హాస్పిటల్‌లో తన సొంత ఖర్చులతో గర్భిణులకు బేబీ కిట్లు పంపిణీ చేశారు. అలాగే ఎంఎల్ఎ, బోళ్ల ఫౌండేషన్‌కు ఛైర్మన్ బోళ్ల రమేష్ తల్లి శ్రీరామలక్ష్మి చేతుల మీదగా పది తోపుడు బళ్లు అందజేశారు. అనంతరం బోళ్ళ ఫౌండేషన్ ఛైర్మన్ బోళ్ల శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, బోళ్ల ఫౌండేషన్ ప్రతినిధులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పెదమామిడిపల్లి కాలనీలో..

చిట్టవరం, గొంది‌లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - నరసాపురం రూరల్

సాగు చేసే ప్రతి రైతూ తమ భూముల వివరాలను ఇ-పంట నమోదుతో పాటు ఇకెవైసి తప్పని సరిగా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఎడిఎ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని చిట్టవరం, గొంది గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు ఎరువులు, పురుగుల మందుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తే దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టవరం సర్పంచి తాడి లక్ష్మణరావు, ఎఒ జోషిలా, ఎఇఒ నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు సేవ చేయడం అభినందనీయం

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


విద్యార్థులకు దిండ్లు అందజేస్తున్న ఎంఎల్ఎ

బిసి హాస్టల్ విద్యార్థులకు మానవత్వంతో సహకారం అందించడం అభినందనీయమని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. పెంటపాడు గ్రామంలోని 9వ వార్డులో రూ.10 లక్షలతో సిమెంటు డ్రెయిన్ పనులకు శంకుస్థాపన, రూ.3 లక్షలతో చేపట్టనున్న పల్లె పుష్కరిణి మారెమ్మ చెరువు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఎండిఒ రామకృష్ణ లక్ష రూపాయలతో దిండ్లు, పరుపులు ఎంఎల్ఎ చేతుల మీదగా బిసి హాస్టల్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎండిఒ రామకృష్ణ మానవతా దృక్పథంతో విద్యార్థులకు సహకరించడం ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో బిజెపి కన్వీనర్ ఈతకోట తాతాజీ, సర్పంచి తాడేపల్లి సూర్యకళ, పుల్లా బాబి, కసిరెడ్డి మధులత, లక్ష్మారెడ్డి, కృష్ణప్రసాద్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు సహకారం అందించాలి

పిహెచ్‌సి వైద్యాధికారి గులాబ్ రాజ్ కుమార్

ప్రజాశక్తి - పాలకోడేరు

క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యాధికారి గులాబ్ రాజ్ కుమార్ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి ముక్త్ భారత్ కార్యక్రమంపై అవగాహనా సదస్సు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి అవగాహన పోస్టర్‌ను గులాబ్ రాజ్ కుమార్ ఆవిష్కరించి మాట్లాడారు. మూడు వారాల పైబడి దగ్గు, బరువు తగ్గడం, చెమటతో కూడిన జ్వరం వంటి లక్షణాలు ఉన్న వెంటనే దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఎవరైనా స్వచ్ఛందంగా ముందుకొచ్చి నెలకు రూ. 600 ఖర్చు చేసినట్లయితే ప్రభుత్వం వారిని గుర్తించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి సత్యనారాయణ, ఎస్‌టిఎస్.సృజన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించకుండానే మెసేజీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన వినతులకు సంబంధించి సమస్యను పరిష్కరించకుండానే అధికారులు పరిష్కరించినట్లు చూపుతున్నారని సిపిఎం మండల కమిటీ సభ్యులు కొత్తపల్లి నాగరాజు విమర్శించారు. మొగల్తూరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొగల్తూరు నుంచి వెంప మీదుగా జిల్లా కేంద్రం భీమవరానికి పలువురు ఉపాధి నిమిత్తం వ్యక్తిగత పనుల వెళ్తుంటారని తెలిపారు. రోడ్డు అధ్వానంగా ఉండడంతో అభివృద్ధి చేయాలని కోరుతూ జులై 28న ఆర్‌డిఒ కార్యాలయంలో, ఆగస్టు 2న భీమవరం కలెక్టర్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రాలు అందించామన్నారు. రోడ్డు నిర్మించకుండానే సమస్య పరిష్కరించినట్లు తమ ఫోన్‌కు మెసెజ్‌లు వచ్చాయని తెలిపారు. ఇది సరికాదని తెలిపారు. సమస్యను పరిష్కరించకపోతే ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు.

సర్పంచికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

మొగల్తూరు:మొగల్తూరు పంచాయతీ పేటపల్లం, ఆదిలక్ష్మి అమ్మవారి కాలనీలు కొద్దిపాటి వర్షానికి జలమయం అవుతున్నాయని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మొగ ల్తూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణకు వినతిపత్రం అందజేసి సమస్యను విన్నవించారు. వర్షపు నీరు రహదారులపై నుంచి కాలనీల్లోకి చేరుతోందన్నారు. నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు, అంటు రోగాలు ప్రబలుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. నీరు బయటికెళ్లేలా చర్యలు చేపట్టాలని సర్పంచిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సర్పంచి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ కేటాయించిన నిధులతో డ్రెయినేజీ, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.సీత, పి.సత్యవతి, కె.సుధారాణి, అడ్డాల నాగమణి పాల్గొన్నారు.

హై ఓల్టేజీతో విద్యుత్ ఉపకరణాలు ధ్వంసం

పెనుమంట్ర:నత్తారామేశ్వరంలోని శివాలయం వద్ద ఉన్న చిన్న వినాయకుని గుడి దగ్గర హైవోల్టేజ్ కారణంగా ఇళ్లల్లోని విద్యుత్‌కు సంబంధించి గృహోపకరణాలు దెబ్బతిన్నాయని పలువురు వాపోయారు. మంగళవారం స్థానికులు విద్యుత్ శాఖ ఎఇ గూడూరి నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. సుమారు రూ.ఐదు లక్షల విలువ చేసిన మిక్సీలు, టీవీలు, ఫ్రిడ్జులు దెబ్బతిన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం విద్యుత్ సరఫరాను క్రమబద్ధీకరించాలని విద్యుత్ వినియోగదారులు కోరారు. ఎఇని కలిసిన వారిలో కె.ప్రభాకర్ రెడ్డి, టి.శ్రీనివాసరెడ్డి, కర్రి చంద్రారెడ్డి, కెఆర్.రెడ్డి పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు పంచాయతీ హైస్కూల్ వీధిలో జై గణేశా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం రాత్రి భారీ అన్న సమారాధన చేశారు. అన్న సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాటు చేశారు.

CHANGE OF NAME

I, **PEMMADI LAVANYA** W/o. Pemmadi Krishna Raghavendra Rao, D.No. 7-14-21, Ward -9, Indira Nagar, Narasapuram-534275, W.G.Dt. A.P.- 534275. I have changed my name from **PEMMADI MANGA** (Old name) to **PEMMADI LAVANYA** (New name) hence forth I am being called **PEMMADI LAVANYA** W/o. Pemmadi Krishna Raghavendra Rao for all purposes.

పాస్‌పోర్టు పోయినది

కొండేటి లలిత కుమారి, భర్త - నాగరాజు, డోర్ నెంబర్ 6-174, కొంతేరు, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా,ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి M5297011 నెంబర్ పాస్‌పోర్ట్ ది 5-01-2015న పొంది యున్నాను. నేను ది 20-7-2025న మా ఇంటి నుంచి మేడపాడు సెంటర్‌లో నా ఒరిజినల్ పాస్ పోర్ట్‌తో జెరాక్స్ కాపీలు తీయించుటకు బైక్‌పై వెళుతుండగా దారిలో నా ఒరిజినల్ పాస్ పోర్ట్ కాపీలు పడి పోయినవి. దారిలో ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్ కు అందజేయగలరు.

నా సెల్ నెంబర్ **79954 58466**

మహారాజశ్రీ II Addl సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) తాడేపల్లిగూడెం వారి కోర్టులో
O.S.No.357/2024

Between:
సత్తి రామకృష్ణారెడ్డి వగైరా ...వాదులు
And
గొలుగూరి శ్రీనివాస త్రిమూర్తిరెడ్డి వగైరా ...ప్రతివాదులు

పై నెంబరు దావా గ్రంథములో 1వ ప్రతివాది అయిన గొలుగూరి శ్రీనివాసత్రిమూర్తి రెడ్డి, S/o.సుబ్బిరెడ్డి, Male, Age 55 Yrs, ముదునూరు (V), పెంటపాడు (M), ప.గో.జిల్లా. అను మీకు శ్రీకోర్టు వారి ద్వారా ఎన్నిపర్యాయములు సమన్లు పంపిననూ మీరు తీసుకొనక తప్పించుకుని తిరుగుతున్నారు. కావున శ్రీకోర్టు వారు Substitute Service ద్వారా సమన్లు జారీ చేయమని ఆర్డరు యిచ్చియున్నారు. సదరు దావా ది.25-9-2025 తేదీన వాయిదా అయి ఉన్నది. కావున ఆ తేదీన మీరు స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ కోర్టుకు హాజరయి, తమ ఆక్షేపణలను తెలుపగలరని, లేనిచో మీ పరోక్షమున దావా తీర్మానము జరుగునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

టి.లీలామాధవ్
తాడేపల్లిగూడెం — అడ్వకేట్, తాడేపల్లిగూడెం
తేది.1-9-2025 — సెల్: 9346409563.

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
Creditor I.P.No.18/2021

Between:
మేడపాటి రామచంద్రారెడ్డి ...పిటీషనరు
And
ఆసూరి శైలజ వగైరా ...రెస్పాండెంట్లు

3వ రెస్పాండెంట్ :
గంధం హరిణి పుష్పవాణి, భర్త వెంకటేశ్వరరావు,
డోర్‌నెంబర్.2-195, మేడపాడు,
యలమంచిలి మండలం.

పై నెంబరు పిటిషన్‌లో 3వ రెస్పాండెంట్ హాజరు నిమిత్తం ది.18-09-2025 సం. తేదికి వాయిదా వేసి ఉన్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టు వారి ఎదుట ఉదయం 10.30 ని॥లకు స్వయంగా కానీ న్యాయవాది ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమందు పిటీషను ముందు గ్రంథము జరుపబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

మేడపాటి వెంకట రామారెడ్డి
పాలకొల్లు — న్యాయవాది, పాలకొల్లు,
తేది.06-09-2025 — పశ్చిమ గోదావరి జిల్లా.

ప్రకటన

నా క్లయింటు యాకాల అశోక్‌కుమార్, తండ్రి : సత్యనారాయణ వారి సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూల్ ఆస్తి యాజమాన్య బదిలీలు ద.నెం.లు 2694/2017, 3118/2011, 651/1990, 364/1983, 1130/1980ల ద్వారా జరగగా, సదరు దస్తావేజులలో 1130//1980, 651/1990 దస్తావేజులు పోయినవి. ఇంటిపన్ను కూడా అమ్మకపుదారు కాసగాని చంద్రావతి భర్త : చంద్రబోస్‌ల పేర్లపై ఉన్నది. పై దస్తావేజుల ద్వారా నా క్లయింట్ అశోక్‌కుమార్ గారు కాసగాని చంద్రావతి గారి వద్ద నుండి కొనుగోలు చేయు చున్నారు. పోయిన దస్తావేజుల కొరకు పోలీస్ ఫిర్యాదు, దొరకబడని ధృవీకరణ సర్టిఫికెట్ నెం. 1520137161018 గా నమోదు జరిగింది.

షెడ్యూల్ ఆస్తి వివరాలు : ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం, జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు, జంగారెడ్డిగూడెం పట్టణం, రి.స. నెం.133, చ॥గ॥ 97 1/2, కొత్త డోర్ నెం. 2-13-655, గ్రౌండ్ మరియు ఫస్ట్‌ఫ్లోర్ గల బిల్డింగ్ హద్దులు : తూర్పు: రోడ్డు, దక్షిణం : బంటు అప్పన్న, పడమర : దార్ల సత్యనారాయణ, ఉత్తరం : టీచర్ సత్యనారాయణ

ఏ.యు. స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులో గృహరుణం పొందుచున్నారు. కావున సదరు ఆస్తిపై ఎవరికైననూ ఏ విధమైన అభ్యంతరాలు వున్న యెడల ఈ ప్రకటన ప్రచురించిన తేదీ మొదలు (7) ఏడు దినములలోగా ఈ దిగువ తెలిపిన మా అడ్రస్‌కి తగిన ఆధారాలతో లిఖిత పూర్వకంగా తెలియజేయ గలరు. లేనియెడల ఎవరికి ఏ విధమైన అభ్యంతరాలు లేవని భావించి లోను పొందుట జరుగును. గడువు తర్వాత వచ్చు ఏ విధమైన క్లయిమ్‌లు, అభ్యంతరాలు మా క్లయింట్ లేదా రుణదాతను గానీ ఏ విధమైన స్థిరపరచ జాలవని యావన్మందికి తెలియజేయు చున్నాను.

ఇట్లు
కె.సర్వేశ్వరరావు,
కె.అలేఖ్య,
న్యాయవాదులు,
డోర్‌నెం. 14-482, భగత్‌సింగ్ నగర్,
యన్‌టిఆర్ బస్టాప్ ప్రక్కన, యనమలకుదురు.
విజయవాడ. ఫోన్ : 95818 73334.